# పౌరోహిత్యం

- కట్టమూరి రాంబాబు

గత యాభై ఏళ్ళుగా ఆ ఊరిలో ఎలాంటి మార్పూ లేదంటారు అందరూ. మార్కెట్ రోడ్డులో కట్టిన కొత్త కొత్త రెండేసి, మూడేసి అంతస్థుల భవనాలూ, స్లాబ్ ఇళ్ళుగా మారిన కొద్దిపాటి పాత పెంకుటిళ్ళూ తప్పితే మరేమీ మార్పులేదు. ఇప్పటికే ఆ ఊళ్ళోని చాలా వీధులకి గోతులు పడిన రోడ్డున్నా, సరైన డ్రైనేజీ సౌకర్యం లేదు. ఆ ఊళ్ళోని అగ్రహారం వీధిలో అయితే అన్నీ పాతకాలం నాటి పెంకుటిళ్ళే. వీధిలో ఎత్తయిన అరుగులు, ముందుకు చొచ్చుకొని వచ్చినట్టున్న చూరులతో ఉంటాయి. ఆ వీధిలోని ఒక ఇంటిలో...

సాయంత్రం స్కూలునుండి వచ్చిన దగ్గర్నుండీ ధుమ ధుమ లాడిపోతున్నాడు రామశాస్త్రి. 'ఎప్పుడెప్పుడు తండ్రి ఇంట్లోకి వస్తాడా- మనసులో ఉన్న నాలుగు మాటలూ అనేసి శుభ్రంగా దులిపేద్దామా' అని చూస్తున్నాడు. ఇప్పటికి అది సాధ్యపడింది. వేదం చెప్పడం పూర్తికావడంతో శిష్యుల్ని పంపేసి లోపలికొస్తున్న తండ్రిని చూస్తూ-

"మీరు నామాట వినరా? ఈ పనులు మానరా?" కోపంగా అన్నాడు రామశాస్త్రి.

"ఇప్పుడు నావలన నీకొచ్చిన ఇబ్బందేమిట్రా?" పొడుం పీలుస్తూ, కొడుకు కళ్ళలోకి చూస్తూ, ప్రశాంతంగా అడిగేడు కామశాస్త్రి.

"ఇబ్బంది కాక మరేమిటి? రిటైరయి పెన్షను తీసుకుంటున్నవాళ్ళు హాయిగా కూర్చోక మీకెందుకండీ ఈ పౌరోహిత్యం?" చికాగ్గా అన్నాడు రామశాస్త్రి.

"పౌరోహిత్యం అంటూ నేనేమన్నా కానిపని చేస్తున్నానురా! ఏ గుళ్ళోనో ప్రతిష్ఠో, పూజో ఉందంటే వెళ్తున్నాను. ఎవరైనా తెలిసిన వాళ్ళు అభిషేకమో, జపమో చెయ్యమంటే చేస్తున్నాను. అంతేగా?" అన్నాడు కామశాస్త్రి.

"మీ మటుకు 'అంతేగా' అనిపించవచ్చును. కానీ, ఊళ్ళో అందరూ 'డబ్బుకోసం నేనే మిమ్మల్ని పంపిస్తున్నాను' అనుకుంటున్నారు. వయసు మళ్ళినా మీకెందుకండీ ఈ తాపత్రయం?" కోపంగానే అన్నాడు రామశాస్త్రి.

"నేను వేదం నేర్చుకున్నది దేవుడి పూజ కోసం- డబ్బుకోసం కాదు. ఎక్కడ పూజ చేయించినా- వాళ్ళు మనస్సంకల్ప దక్షిణగా పది రూపాయలిచ్చినా, పది పదులిచ్చినా సంతోషంగా తీసుకుంటానే తప్ప 'తక్కువిచ్చారే' అని నేనెప్పుడూ బాధపడను."

ఇంకా ఏదో చెప్పబోతుండగా ఎవరో దంపతులు వచ్చారు- 'పంతులుగారూ!' అనుకుంటూ...

"ఏమిటండీ- ఇలావచ్చేరు?" పలకరిస్తూ బయటకొచ్చేడు కామశాస్త్రి.

"మీరు చేసిన గ్రహజపాల వలన మా అబ్బాయి ఆరోగ్యం కుదుటపడింది. మీకు కృతజ్ఞతలు చెప్పుకుందామని వచ్చేము"- యాపిల్ పళ్ళు కామశాస్త్రి చేతిలో పెట్టి నమస్కరిస్తూ అన్నాడు వచ్చినాయన.

"చాలా సంతోషం. సర్వే జనాస్సుఖినో భవంతు. అయినా ఇందులో నేను చేసిందేముందండీ? డాక్టరుకి చూపించి మంచి మందులు వాడేరు. ఆపైన దైవసహాయం కోరి నేను చేసిన జపాలు ఫలించేయి. మీ కుర్రాడి జబ్బు నయమయింది" చిరునవ్వుతో అన్నాడు కామశాస్త్రి.

"అలాగంటారేమిటి- పంతులుగారూ! వశిష్ఠులవంటి ఋషులు మీరు. మీరు చేసిన జపాల ఫలితం ఏమీ లేదంటారా?" ఆశ్చర్యంగా అడిగేడు వచ్చినాయన.

"అలాగని కాదు. ముందుగా మానవ ప్రయత్నం చేసి ఆ తర్వాత దేవుణ్ని సాయం అడగాలి" అంటున్నాను. వెయ్యినొక్క సంవత్సరాలు స్వంతంగా పోరాడేడు గజేంద్రుడు. ఆ తర్వాతనే- ఇక తనవల్ల కాదనీ, నువ్వు తప్ప వేరే దిక్కులేదనీ, కారుణ్యభావంతో కాపాడమనీ దేవుణ్ని ప్రార్థించేడు. అందుకే శ్రీమన్నారాయణుడు భక్తుణ్ని రక్షించడమే లక్ష్యంగా యుద్ధానికి బయల్దేరేడు- ఆయుధాలున్నాయో, లేవో కూడా చూసుకోకుండా. ఒక జంతువే అంత ప్రయత్నం చేసినప్పుడు- మనుషులం- మనం మనవంతు ప్రయత్నం చెయ్యాలి కదా! ఆ తర్వాతే దేవుడి మీద భారం వెయ్యాలి" చెప్పేడు కామశాస్త్రి.

"డాక్టరుగారు కూడా ఇలాగే చెప్పేరండీ! 'మీ పూజలూ జపాలూ, మొక్కుబడులూ- మీ ఇష్టం. కానీ నేను రాసిన మందులు వాడడం మాత్రం మానకండి!' అన్నారు" ఆశ్చర్యంగా చెప్పింది వచ్చినాయన భార్య. కాసేపు ఏవేవో విషయాలు మాట్లాడి- "వస్తామండీ!" అంటూ నమస్కరించి వెళ్ళిపోయారు వాళ్ళు.

"మీకు కన్నకొడుకు కన్నా ఊరివాళ్ళెక్కువైపోయారన్న మాట! వశిష్ఠుడూ, విశ్వామిత్రుడూ అనగానే పొంగిపోయి, పనికిమాలిన కబుర్లు చెబుతూ కూర్చున్నారు. డబ్బు కక్కుర్తికొద్దీ కాకపోతే మీకెందుకండీ ఇవన్నీ?" గద్దిస్తూ అన్నాడు రామశాస్త్రి.

"నేను చెప్పేనుకదూ! నాకు దేవతారాధన ఇష్టమని. అందుకే వేదం నేర్చుకున్నాననీనూ! ఏదోఒకటి చెయ్యకపోతే నేను నేర్చుకున్న నాలుగు ముక్కలూ మరిచిపోతాను" అన్నాడు కామశాస్త్రి.

"ఇంటి దగ్గర శిష్యులకి పాఠాలు చెప్పుకుంటున్నారు కదా! అది చాలదా? ఉద్యోగంతోపాటు ప్రైవేటులు చెప్పి నేనూ, పెన్షనుకు తోడు పౌరోహిత్యం చేసి మీరూ తెగ సంపాదించేస్తున్నామని మా టీచర్లు అందరూ అంటున్నారు". అన్నాడు రామశాస్త్రి.

"చూడు రామం! నేను ఏ దురుద్దేశం లేకుండా ఉన్నంతకాలం నా గురించి ఎవరేమనుకున్నా, విమర్శించినా నేను పట్టించుకోను"- ప్రశాంతంగా చెప్పి సంధ్యావందనం చేసుకోడానికి వెళ్ళిపోయేడు కామశాస్త్రి.

"ఒట్టి మొండి మనిషి"- చీదరించుకుంటూ అనుకున్నాడు రామశాస్త్రి.

కామశాస్త్రి టీచరుగా పనిచేసి రిటైరయ్యేడు. ఆ పాతకాలపు ఇంటితోపాటు తండ్రి మిగిల్చిన ఆస్తి 'దేవతార్చన సంపుటి' మాత్రమే. రోజూ స్నానం చేసిన తరువాత సాలగ్రామాలని కడిగి, ఒక పువ్వువేసి, అగరొత్తి వెలిగించి, దీపం పెట్టేవాడు. బెల్లంముక్కో, ఉంటే ఏ పండో దేవుడి ముందుంచి చెయ్యి తిప్పేవాడు. తరువాత- తరువాత దేవుడి నెత్తిన ఉత్తినే నీళ్ళు పొయ్యడమేమిటి' అనిపించి నమకం, చమకం, శ్రీసూక్తం, పురుష సూక్తం నేర్చుకున్నాడు. అలా మొదలుపెట్టి రిటైరయ్యేనాటికి వేదం మొత్తం కాకపోయినా చాలా భాగం నేర్చుకున్నాడు. 'బతకలేని బడిపంతులు'గా వచ్చే జీతంతో పెద్ద కుటుంబాన్ని పోషించడం కష్టమై, పూజలకనీ, ప్రతిష్ఠలకనీ వెళ్ళడం అలవాటు చేసుకున్నాడు. కొడుకులు మాత్రం ఉద్యోగాలు చేసుకుంటూ, పౌరోహిత్యం చెయ్యడానికి ఇష్టపడక, ఎవరూ వేదం నేర్చుకోలేదు. అందుకే తండ్రీ, కొడుకులకి తరచూ ఈ తగువు జరుగుతూనే ఉంటుంది.

★ ★ ★

"నమస్కారం గురువుగారూ! మీ ఆశీర్వాదం కావాలి" నమస్కరిస్తూ అన్నాడు సూరిబాబు అని పిలవబడే సూర్యనారాయణశర్మ.

"ఆయుష్మాన్ భవ! ఏవిట్రా సూరిబాబూ! పెద్దమనుషులందర్నీ వెంటేసుకుని వచ్చేవంటే ఏదో పెద్ద విశేషమే ఉంటుందే!" నవ్వుతూ అన్నాడు కామశాస్త్రి.

"అవును గురువుగారూ! వరుణ జపాలు చెయ్యాలని అందరం సంకల్పించాం. అయితే దాన్ని గురించి పూర్తి వివరాలు నాకు తెలియవు. ఏ కల్పంలోనూ దొరకలేదు. పెద్దవారు- మీరు కాస్త సహకరించాలి" అన్నాడు బాసింపట్టు వేసుకుని కూర్చుంటూ.

"ఇప్పుడెందుకురా- వరుణ జపాలు?" నవ్వుతూ అడిగేడు కామశాస్త్రి.

"అదేంటి గురువుగారూ- అలా అంటారు? కిందటేడు దీపావళికి పెట్టిన ముసురు తర్వాత ఇప్పటివరకూ చినుకులేదు. ఆషాఢం వెళిపోతోందిగానీ ఆకాశంలో ఎక్కడా మబ్బుతునక కనపడటంలేదు. ఆకుపోసిన రైతులంతా ఆకాశం వైపు చూస్తూ ఏడుస్తు


న్నారు. ఇప్పుడెందు కంటారేమిటి?'' పక్కనుండి సూరిబాబుకి సపోర్టుగా మాట్లాడేడు చెన్నుభొట్ల వాడు.

"నవమాసాలూ నిండనిదే ప్రసవం ఎలా అవుతుందిరా? ఈనెల కూడా పూర్తికానీ'' పిలక సవరించుకుంటూ అన్నాడు కామశాస్త్రి.

"అయ్యా! పురోహితులు- తమరే అలా అంటే ఎలా చెప్పండి?'' వచ్చిన పెద్దమనుషుల్లో ఒకడన్నాడు.

"పురోహితుడంటే ఊరు క్షేమాన్ని, పౌరుల హితాన్నీ కోరేవాడు. పురప్రజల హితాన్ని కోరి దేవతారాధన చేసేవాడు. వరుణ జపాలు చెయ్యడమంటే ఏమిటనుకున్నారు? అది మూడు రోజుల తంతు. వరుణుడికీ, అధిదేవతలకీ జపాలు చెయ్యాలి. హోమాలు చెయ్యాలి. కాటకాలు (వేదంలో ఒక భాగం) చెప్పాలి. నమక, చమక సహిత రుద్రాభిషేకం చెయ్యాలి. మూడోరోజు సహస్ర ఘట్టాభిషేకం చెయ్యాలి. అందుకు శివుడి గర్భగుడి ద్వారం దగ్గర శివలింగం మునిగే ఎత్తులో గోడకట్టి శివలింగం మునిగేలాగు వెయ్యి కడవల నీళ్ళు పొయ్యాలి. ఆ తరువాత అన్నదానం చెయ్యాలి. బోలెడంత శ్రమ, డబ్బు ఖర్చుతో కూడుకున్న పని''- గుక్కతిప్పుకోకుండా చెప్పేడు కామశాస్త్రి.

"డబ్బు విషయంలో మనం సందేహించనక్కరలేదు గురువుగారూ! ఊళ్ళో వాళ్ళంతా విరాళాలిస్తారు'' అన్నాడు సూరిబాబు.



"అయితే మాత్రం? డబ్బులిస్తారు కదాని చేసెయ్యమనేనట్రా? గ్రీష్మంలో 'ఎండలు మండిపోతున్నాయి- నాలుగు వర్షాలు పడితే బాగుణ్ణు' అనిపిస్తుంది. అందుకని అప్పుడు చేసేస్తావా?'' గద్దిస్తూ అడిగేడు కామశాస్త్రి.

"ఇది ఆషాఢమాసం కదండీ!'' అన్నాడొకడు.

"చూడండి! శ్రావణ, భాద్రపద మాసాలు వర్షఋతువు. ఎన్ని అవాంతరాలొచ్చినా సూర్యుడు క్రమం తప్పకుండా తన విధి తను నిర్వర్తిస్తున్నాడా? అలాగే వరుణుడు కూడా వర్ష ఋతువులో వర్షించాలి. అది ప్రకృతి ధర్మం. మనం ఎలాగూ మన ధర్మాన్ని పాటించడంలేదు. దేవుళ్ళని కూడా ధర్మం తప్పమంటే ఎలా? అదీగాక కల్పంలో కూడా భాద్రపదమాసం చివరికి కూడా వర్షాలు పడక పోతే వరుణుణ్ని శాంతింప చెయ్యడానికి జపాలు చెయ్యమని చెప్పేరు'' వివరించేడు కామశాస్త్రి.

"మీరలాగంటే ఏం చెప్తాం గురువుగారూ! చూస్తున్నారా? వాతావరణం ఎంత వేడిగా ఉందో?'' దిగులుగా మొహం పెట్టి అన్నాడు చెన్నుభొట్లవాడు.

"ఒరేయ్! ప్రకృతి, పురుషులు- భార్యా,భర్తల్లాంటి వాళ్ళురా! ఒకరికొకరు సహకరించుకుంటూ పోతేనే సుఖంగా జీవించగలిగేది. దేవుణ్ని కరుణించమని కోరే ముందు మనం ఎంతవరకూ ప్రకృతికి సహకరిస్తున్నామో ఆలోచించు. ప్రకృతిని సంరక్షించవలసిన మనమే దాన్ని సర్వనాశనం చేస్తున్నాము. వర్షాలు పడడానికీ, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండడానికీ అవసరమైన చెట్లు నరికేస్తున్నాము. కొండలు పిండి చేసేస్తున్నాము. ఇవి చాలక యంత్రాల ద్వారా, రసాయనాల ద్వారా వాతావరణ కాలుష్యం చేస్తున్నాము. మరి వర్షాలెలా పడతాయి? వేడిగా ఉండక ఏమౌతుందీ? గాల్లో దీపం పెట్టి 'దేవుడా నీదే భారం' అంటే అవుతుందా? వాతావరణాన్ని రక్షించడానికి ముందు మనమేం చెయ్యాలో అది చెయ్యాలి. మనం ప్రకృతికి సహకరిస్తే అదీ మనకి సహకరిస్తుంది'' ముక్తాయించేడు కామశాస్త్రి.

ఈ సంభాషణంతా వింటూ గదిలోంచి, ఆశ్చర్యంగా తండ్రినే చూస్తున్నాడు రామశాస్త్రి.

★ ★ ★

అనుకున్న ప్రకారం వరుణ జపాలు చేయించేసేరు కమిటీవారు. కామశాస్త్రికి మాత్రం ఆహ్వానం రాలేదు. ఆషాఢ బహుళ చతుర్దశి- మాస శివరాత్రినాడు సహస్ర ఘట్టాభిషేకం చేసేరు. అభిషేకం పూర్తయీ అవ్వడంతోనే పెద్దవాన పడింది. అందరూ సంతోషించేరు. కార్యక్రమ నిర్వాహకులని అందరూ మెచ్చుకున్నారు. కామశాస్త్రి వట్టి ఛాందసుడనీ, అతని మాటలు విని ఉంటే ఈ జన్మలో మరి వర్షం చూసేవాళ్ళం కామనీ తిట్టేరు.

ఆ తరువాత పదిరోజులపాటు మరి వర్షంలేదు. వరుణ జపాలు చేసిన ఫలితమో, వర్షాకాలం రావడం కారణమో తెలియదు గాని ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి. కొన్నిచోట్లయితే నదులు పొంగి వరదలొస్తాయేమోనని భయపడుతున్నారు కూడా.

"మీరు పది రూపాయలు దక్షిణ వస్తుందంటే పూజ చేయిస్తారు గానీ, ఊరి బాగుకోసం మాత్రం ముందుకు రారని అందరూ అనుకుంటున్నారు గురువుగారూ!'' బాధగా అన్నారు శిష్యులు.

"ఒరేయ్! నేను ఏ దురుద్దేశం లేకుండా ఉన్నంతకాలం నాగురించి ఎవరేమనుకున్నా, విమర్శించినా నేను పట్టించుకోను-'' నిర్వేదంగా అన్నాడు కామశాస్త్రి.

ఎప్పుడూ వినేమాటలే అయినా చాలా శ్రావ్యంగా వినిపించేయి రామశాస్త్రికి. ఆ మాటల్నే వింటూ యధాలాపంగా గదిలో బీరువా క్రింద పడి ఉన్నదేమిటా? అని చూసేడు. దుమ్ముకొట్టుకుపోయి ఉన్న 'నేమ్ బోర్డ్' అది. జాగ్రత్తగా తుడిచేడు.

'చల్లా రామశాస్త్రి, బి.ఎ., బి.యిడి, టీచరు' అని రాసి ఉంది.

ఈ బోర్డు చూసి 'ఇదేరా! చల్లా పంతులుగారిల్లు' అనుకుంటూ తండ్రి దగ్గరికి ఎందరో వచ్చేస్తున్నారన్న కోపంతో రామశాస్త్రి తీసి పారేసిన బోర్డు అది.

మర్నాడే వీధిగోడకి మళ్ళీ బోర్డు తగిలించేడు. కొత్తగా రాయించిన బోర్డు ఇలా ఉంది-

'చల్లా కామశాస్త్రి, పురోహితులు'

★